క్లుప్తంగా

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించాలి

గోకవరం: గ్రామంలో నిర్మిస్తున్న రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సంఘం సభ్యులు సహకరించాలని రజక చైతన్య సంస్థ జగ్గంపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంటి వెంకటేష్ కోరారు. గోకవరంలో నిర్మాణ దశలో ఉన్న రజక కమ్యూనిటీ హాలు వద్ద మంగళవారం మండల రజక చైతన్య సంస్థ సమావేశం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి భీమవరపు వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన సంస్థ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం రజకులకు కేటాయించిన స్థలంలో ఎంపీపీ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం శ్లాబ్ వేశామని, మిగిలిన నిర్మాణానికి సంఘం సభ్యులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల చైర్మన్ తాడి కృపారావు, గౌరవాధ్యక్షుడు కోనేటి నాగరాజు, తెల్ల రామారావు, ర్యాలి రాంబాబు, రాఘవ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పెదపూడి: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం పెదపూడిలో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సేవాసమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు చౌదరి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే వైద్యపరీక్షలు జరుగుతాయన్నారు. కంప్యూటర్ ద్వారా పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంటిలో శుక్లాలు ఉన్న వారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు.

సుబ్రహ్మణేశ్వరునికి అభిషేకాలు


సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: గ్రామంలోని కొలువైన ఉన్న కుమార సుబ్రహ్మణేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలోని ఆలయం ఈవో రామలింగ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతర కమిటీ సమావేశం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని మావుళ్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారి జాతర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వచ్చే ఏడాదిలో జాతర నిర్వహించడానికి నిర్ణయించారు. 2013లో జరిగిన జాతర అనంతరం పదకొండేళ్లకు 2024లో చేయనున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఈఆర్‌వో శ్రీనివాస్

పెదపూడి: అర్హులందరికీ ఓటుహక్కు కల్పించడానికి కృషి చేస్తున్నామని అనపర్తి ఎన్నికల నమోదు అధికారి, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏబీవీఎస్‌డీ శ్రీనివాస్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులు, ఫారం 6బీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తులను సకాలంలో నిబంధనల ప్రకారం పరిశీలించాలని బీఎల్‌వోలు, వీఆర్వోలకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జీఎం రామ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు.

17న వాహనాలకు వేలం

మధురపూడి: కోరుకొండ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఒక ఆటో, 40 ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామన్నారు. పాల్గొనేవారు ఆధార్, పాన్‌కార్డులతో పాటు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం అనంతరం డిపాజిట్ చేసిన నగదు తిరిగి చెల్లిస్తామన్నారు.

టీడీపీ ఇన్‌చార్జిని వెంటనే నియమించాలి

మధురపూడి: టీడీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జిని త్వరితగతిన నియమించాలని కార్యకర్తలు అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోరుకొండ హరేరామ సమాజం ఆవరణలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మాజీ ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, నాయకులు రొంగల శ్రీను, కటకంచలం తదితరులు పాల్గొన్నారు.

ఐన్‌స్టీన్ జయంతి

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఆయన విగ్రహానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యాజీ, శ్రీశైలశాస్త్రి, డి.సునీత పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. విశ్వాసమే జయం

- నేటి నుంచి ఇంటర్మీడియెట్, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ ఫలితాలపై ప్రత్యేక దృష్టి


పందలపాకలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

బిక్కవోలు: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఒక వైపు అధికారులు మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ అమలు చేస్తుండగా.. మరోవైపు విద్యార్థులు పూర్తి స్థాయిలో పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. బడులు, కాలేజీల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళికతో మంచి ఫలితాలు

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో మొత్తంగా 4,863 మంది విద్యార్థులు పదోతరగతి, 9,000 మంది ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయనున్నారు. బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలవుతుండగా, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సమయాన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత ఎక్కువ స్కోర్ చేయొచ్చు. పాత మోడల్ పేపర్‌లను ప్రాక్టీస్ చేసుకుంటే విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నపుడే ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. అందుకే ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి ప్రోటీన్లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. రోజుకి 7 నుంచి 8 గంటల నిద్రతో పాటు కొద్దిపాటి వ్యాయామం, మెడిటేషన్ వంటివి చేయడం మంచిది. అనవసర ఒత్తిళ్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రణాళికతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించొచ్చని వైద్యులు చెబుతున్నారు.

ప్రశాంతంగా ఉండాలి



విద్యార్థులు ప్రశాంతంగా ఉంటే వారి ఆలోచన బాగుంటుంది. దీంతో పరీక్షలు బాగా రాయగలుగుతారు. ఆరోగ్యంగా ఉంటే మానసికంగా దృఢంగా ఉండగలుగుతారు. ఒత్తిడికి గురైతే సమయం వృథా అయిపోతుంది.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యులు, అనపర్తి

మెరుగైన ఫలితాల కోసం కృషి



పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులు భయపడకుండా పరీక్ష రాసేలా పాఠశాలల్లో ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– చింతా వెంకట సోమిరెడ్డి, హెచ్‌ఎం, పందలపాక ఉన్నత పాఠశాల

200 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పెదపూడి: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మంజూలూరి విశ్వేశ్వరరావు అన్నారు. పెదపూడిలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీనివాసరెడ్డి మందులషాపు నిర్వాహకుడు చిర్ల సూర్యనారాయణరెడ్డి (ఫార్మసిస్ట్) భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా కాకినాడ పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ స్టార్స్ ఆధ్వర్యంలో కాకినాడలోని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు వీవీ రావు, మూర్తి, నాగిని, సూర్యనారాయణరాజు, గణేష్ ప్రసాద్, గిరికిపర్తి నమశ్శివాయ, ఇందుల ప్రసాద్ నాయుడు, చిర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళి


అమర వీరుల వర్ధంతి సభలో మాట్లాడుతున్న తాన్యా

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడులో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రపంచ కమ్యూనిస్టు మహోపాధ్యాయులు కారల్‌మార్క్స్ 140వ వర్ధంతి, లెనిన్ నూరో వర్ధంతి నిర్వహించారు. సీహెచ్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు పి.తాన్యా అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి చిత్రపటాల వద్ద పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా కార్యదర్శి వి.భీమశంకర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, పీవైఎల్ నాయకులు ఎస్.నాగార్జున, ఆర్.సుబ్బారావు, నూకరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో..

అఖిల భారత రైతు కూలీ సంఘం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో రాజానగరంలో కారల్ మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉభయ పార్టీల ప్రతినిధులు పి.వెంకట్ నాయుడు, జె.సత్తిబాబు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం డివిజన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్


గోకవరం ప్రభుత్వాస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ వైద్యులకు సూచించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఇద్దరు టీబీ వ్యాధిగ్రస్తులకు గ్రామానికి చెందిన గంగిశెట్టి బాలకోటేశ్వరరావు సహకారంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.వసుంధర, డాక్టర్ వనజాకుమారి, డాక్టర్ ప్రదీప్‌సుందర్, కాయకల్ప టీం సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఆందోళన


డంపింగ్‌యార్డు వద్ద ఆందోళన చేస్తున్న బొమ్మూరు ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్ సమీపంలో నివాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు కాలుష్యం వల్ల పెద్దలు, పిల్లలు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డులో జంతు కళేబరాలను తగులబెట్టడం వల్ల పొగవ్యాప్తి చెంది ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇది గ్రామంలోని 1500 కుటుంబాల సమస్య అని, కలెక్టర్ పట్టించుకోవాలని కోరారు. జాతీయ రహదారిపై ఉన్న డంపింగ్ యార్డు వద్ద మంగళవారం ఉదయం గ్రామ ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ వార్డు మెంబరు ఎలుగొండ లక్ష్మి మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల చెత్త కూడా ఈ డంపింగ్ యార్డులో వేస్తున్నారని, కలెక్టర్, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. దుర్వాసన కారణంగా భోజనాలు చేయలేక పోతున్నామని, దోమల బెడద పెరిగిందని, జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన చెందారు. మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్ మాట్లాడుతూ డంపింగ్ యార్డును తరలిస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదన్నారు. పిల్లా తనూజ మాట్లాడుతూ సమీపంలోనే ప్రాథమిక పాఠశాల, హైస్కూలు, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయని, విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు. తరలించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ అక్కడకు వచ్చి వారం రోజుల్లో డంపింగ్ యార్డు తరలించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్సేటి శివ, రాయుడు సునీల్ కుమార్, కంఠం శ్రీనివాస్, చిట్టి జగ్గునాయుడు, నరాలశెట్టి శ్రీనివాస్, కోట్ల దుర్గ, ఈతకోట సందీప్, మరడపు చిన్న, మరడపు రాంబాబు, పిల్ల సురేష్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ


విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి


గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినికి మాత్ర వేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్


రాజానగరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం


గుమ్ములూరులో విద్యార్థులకు మాత్రల పంపిణీ

అనపర్తి: చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమయ్యే నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నివారించవచ్చునని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ అపరిశుభ్రత కారణంగా నులి పురుగులు వ్యాప్తి చెందుతాయని అన్నారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఆరోగ్యశాఖ సిబ్బంది సుబ్రహ్మణ్యం, అచ్యుతాంబ, అంగన్‌వాడీ టీచర్ ఎస్.దుర్గాభవాని, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

91 శాతం మంది విద్యార్థులకు..

గోకవరం: మండలంలోని 91 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేసినట్టు కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర తెలిపారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెచ్‌ఈ శైలజ, హెచ్‌ఎమ్ చిమ్మరాజుదొర, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

రాజానగరం: జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండ్‌జోల్ మాత్రలను ఎంఈఓ ఎం.రామన్నదొర పంపిణీ చేశారు. ఒకటి నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుందని, ఫలితంగా రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి. రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. గుమ్ములూరు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం నాగత్రినాథరావు మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్తహీనత, ఆకలి మందగించడం, బరువు తగ్గడం జరుగుతుందన్నారు. కోరుకొండ, గాడాల, దోసకాయలపల్లి, గాదరాడ, కణుపూరు, నర్సాపురం, కోటికేశవరం గ్రామాల్లోని పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు కోటేశ్వరరావు, పుణ్యశాంతి, హెచ్‌ఎంలు శీలం నాగత్రినాథ్, గంగాభవాని, విజయశ్రీ, శ్రీనివాస్, మురళీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీవో కె.రమేష్, ఎంఈవో కె.స్వామినాయక్, సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, హెచ్‌ఎం పుష్పలత నులిపురుగుల నిర్మూలన మాత్రలను మింగించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, సీహెచ్‌వో పి.రాధాకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో 12,570 మంది పిల్లలతో నులిపురుగుల నిర్మూలన మాత్రలు మింగించాల్సి ఉందని, 92 శాతం పూర్తయ్యిందన్నారు. మిగిలిన వారికి ఈనెల 18న మాత్రలు అందజేస్తామన్నారు.


బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: మండలంలోని జాతీయ నులి పురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బిక్కవోలు పీహెచ్‌సీ పరిధిలో 5,780 విద్యార్థులు ఉండగా ఇప్పటికే 5,504 మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందించినట్టు ఆ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజీవ్ తెలిపారు.

రంగంపేట మండలం

రంగంపేట: పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీఓ శ్రీరామరాజు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన మాత్రలు వేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు లావణ్య మాట్లాడుతూ మండలంలోని 42 ఎంపీపీ స్కూల్స్, 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 12 ప్రైవేటు పాఠశాలలు, 2 కళాశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తం 119 చోట్ల 10,268 మందికి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వి. పార్థసారథి, సీహెచ్‌ఓ జయమణి, ఎంపీహెచ్‌ఈఓ ఎస్‌వీవీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల ప్రకటన


కమిటీల వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ మండల కమిటీలు, అనుబంధ విభాగ కమిటీలకు ఎంపికైన పార్టీ నాయకులు, కార్యకర్తల వివరాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ఈ కమిటీల్లో కూడా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులకు స్థానం కల్పించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించి అధ్యక్షులుగా ఎంపికైన వారి వివరాలు...

పార్టీ మండల అధ్యక్షుడిగా సత్తి రామకృష్ణారెడ్డి (అనపర్తి), రైతు విభాగం–నల్లమిల్లి నాగిరెడ్డి(కుతుకులూరు), బీసీ సెల్–చిట్టూరి పుండరీవాసు(అనపర్తి), వాణిజ్య విభాగం–కొవ్వూరి సుధాకర్‌రెడ్డి(కుతుకులూరు), సేవాదళ్–ఎంవీవీ రామారెడ్డి(అనపర్తి), ఎస్సీ సెల్ –పులపకూరి గంగరాజు(పీరారామచంద్రపురం) ఎంపికయ్యారని ఎమ్మెల్యే తెలిపారు. యువజన విభాగం–పడాల విజయానందరెడ్డి(కుతుకులూరు), ప్రచార కమిటీ–తేతల వెంకటరెడ్డి(అనపర్తి), మహిళా విభాగం–ఇమ్మంది విజయకుమారి(అనపర్తి), ముస్లిం మైనారిటీ విభాగం–షేక్ ఈసేబు(అనపర్తి), పంచాయతీరాజ్ –తాడి వెంకట రామకృష్ణారెడ్డి(కొప్పవరం), విద్యార్థి కమిటీ–కొవ్వూరి లక్ష్మీనారాయణరెడ్డి(అనపర్తి), ఎస్టీ సెల్–సంగడాల సత్యనారాయణ(అనపర్తి), చేనేత కమిటీ–తేలు శ్రీను (అనపర్తి), క్రిస్టియన్ కమిటీ–ఆరుగుళ్ల నాగేశ్వరరావు(అనపర్తి) ఎంపికైనట్టు తెలిపారు. వీరితో పాటు ప్రతి కమిటీలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 17 మందిని కమిటీ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, అధికార ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలను వివరించారు. సింగవరం పంచాయతీలోని కైలాసగిరికి పామాయిల్ తోటల్లోంచి విద్యుత్ లైన్ వెళ్లిందని, గోదావరి వరద సమయంలో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, దీనితో పలువురు ఇబ్బందులు పడుతున్నారని, నాగరత్నం కాలనీ నుంచి నేరుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ సంగన చినపోశయ్య కోరారు. అలాగే కైలాసగిరి ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, ముఖ్యంగా శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో ట్రాక్టర్లపై తరలిస్తున్నారని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆ విషయంతన పరిధిలో లేదని, మైన్స్ డిపార్ట్‌మెంట్ మాత్రమే పర్మిషన్ ఇవ్వాలన్నారు. రాపాక ఎంపీటీసీ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పంచాయతీకి ట్రాక్టర్ సదుపాయం, డంపింగ్ యార్డ్‌ను కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ రామారావు మాట్లాడుతూ ఉగాదికి మండలంలో 435 ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ సచివాలయాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, హెచ్3ఎన్2 వైరస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భూసర్వే వేగవంతంగా జరుగుతోందని, రైతుల పంట భూముల విషయంలో ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ సత్యనారాయణ కోరారు. డ్వాక్రా సభ్యులకు చేపల పెంపకానికి, చిరు వ్యాపారాలకు సబ్సిడీపై రుణాలు అందిస్తామని ఏపీఎం మహాలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీడీవో కె.రమేష్, ఎంఈవో కె.స్వామినాయక్, వైస్‌ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీలు మాకిరెడ్డి దేవి, తాడేపల్లి వెంకట్రావు, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

మహిళలందరూ విద్యావంతులు కావాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రతి మహిళ విద్యావంతురాలైతే సమాజం వేగంగా అభివృద్ధిని సాధిస్తుందని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి అన్నారు. 'లింగ సమానత్వం'పై కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. డీన్ డాక్టర్ వి.కుసుమ కుమారి మాట్లాడుతూ గతంతో పోలిస్తే వర్తమానంలో మహిళలు ఎంతో చైతన్యవంతులయ్యారన్నారు. ప్రస్తుతం మహిళలలో అక్షరాస్యత శాతం 56 శాతంగా ఉందని, ఇది మరింతగా పెరిగితేనే అన్ని రంగాలలోనూ ప్రతిభతో పోటీ పడగలుగుతామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్. లీలావతి, డాక్టర్ శ్రీగౌరీరెడ్డి, హెచ్‌ఓడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడానికి నగరపాలక సంస్థ కొన్ని చర్యలు చేపట్టిందని కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. షెల్టన్ జంక్షన్‌లో రోడ్డు విస్తరణ ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్ నుంచి షెల్టన్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. తొలిదశలో 80 అడుగుల రోడ్డు విస్తరణ చేస్తామని ప్రకటించారు. దీనిపై రెండు నెలలుగా సర్వే చేయడం జరిగిందని, దాదాపు 62 నిర్మాణాలు ఈ రోడ్డు విస్తరణలో పాక్షికంగా ప్రభావితం అవుతాయన్నారు. ఆ యజమానులు నగరపాలక సంస్థకు సహకరించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. బుధవారం నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. షెల్టన్ జంక్షన్ నుంచి తిలక్ రోడ్డు వరకు విస్తరణ వల్ల సిటీలో ట్రాఫిక్‌కు మార్గం సుగమవుతుందన్నారు.

బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికల్లో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు నూతన కోఆర్డినేటర్లను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నూతన కోఆర్డినేటర్లు తమ అసెంబ్లీలోని మండలాల్లో పూర్తిస్థాయిలో కమిటీలు వేసే విధంగా మండల అధ్యక్షులతో కలిసి పనిచేయాలన్నారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి అసెంబ్లీ కోఆర్డినేటర్ పనిచేయాలని పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు యెనుముల రంగారావు (రంగబాబు), రాజమహేంద్రవరం రూరల్‌కు ఆకుల శ్రీధర్, రాజానగరానికి ఏపీఆర్ చౌదరి, అనపర్తికి ఎం. శివరామ కృష్ణంరాజు, కొవ్వూరుకు మాట్ల ఆంజనేయులు, నిడదవోలుకు బండి సత్యనారాయణ, గోపాలపురానికి మైలు శ్రీనివాస్ నియమించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కడియం: మండలంలోని పొట్టిలంకలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం త్రైత సిద్ధాంతి భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేశారు. వేదిక అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు లక్ష్మీనారాయణ, విజయ్, జయరామ్, రాణి, సంధ్య, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ త్రైతసిద్ధాంత జ్ఞానం ద్వారా సమాజంలో కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు.